క్లుప్తంగా

ముదిరాజులకు అండగా ఉంటాం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ముదిరాజ్ కులస్తులు

ఇల్లంతకుంట: ముదిరాజుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘ భవనాన్ని పరిశీలించి, ముగులు పనుల కోసం తన నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. నెల రోజుల్లోగా ముదిరాజ్ సంఘం భవన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్‌లను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు ఇవ్వడంతో పాటు, సబ్సిడీపై వాహనాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ గొడుగు తిరుపతి, ఏఎంసీ వైస్‌చైర్మన్ చందన్, ఉపసర్పంచ్ సాదుల్ పాల్గొన్నారు.

కౌలురైతు కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మానవతావాదులు

ముస్తాబాద్: ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన ముస్తాబాద్‌కు చెందిన కౌలు రైతు అనమేని నర్సింలు కుటుంబాన్ని ఆదుకునేందుకు మానవతావాదులు ముందుకు వచ్చారు. నర్సింలుకు భార్య, ఇద్దరు పిల్లలు వుండగా, వారిని ఆదుకోవాలని సామాజిక మాధ్యమాల్లో మాజీ ఎంపీటీసీ గజ్జెల రాజు చేసిన విజ్ఞప్తికి ఎంతో మంది స్పందించి రూ.లక్ష పోగు చేసి, నర్సింలు కుటుంబానికి అందించినట్లు మాజీ ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్ నాయకుడు కంచం నర్సింలు తెలిపారు.

పనులను పరిశీలించిన అధికారులు



మాట్లాడుతున్న అధికారులు

వీర్నపల్లి: మండల కేంద్రలో రోడ్డు విస్తరణలో భాగంగా నిలిచిన పనులను సెస్, మిషన్ భగీరథ, ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రక్కన కరెంట్ స్తంభాలు, వాటర్ పైప్‌లైన్లు వేయడం గూర్చి స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఇళ్లు కోల్పోయిన యజమానులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇళ్లు కట్టడం సగం పూర్తయినా బిల్లులు రావడం లేదని, వెంటనే బిల్లులు చెల్లించిన తర్వాత మిగతా పనులు పూర్తిచేయాలన్నారు. సెస్ ఎండీ సూర్యనారాయణ, మిషన్ భగీరథ ఈఈ జానకి, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వరదొస్తే.. వణుకే.!



ఈ ఫొటోలో ఇళ్ల చుట్టూ నీటితో నిండి కాలనీ పేరు రాజీవ్‌కాలనీ. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఈ కాలనీ ఈదుల చెరువు శిఖం భూమిలో ఇళ్లు నిర్మించుకున్న ప్రజలు ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీల్లో వరద నీరు చేరడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు నీట మునగడంతో అనేక అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి వర్షాకాలంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం.. భయంగా జీవనాన్ని సాగిస్తున్నారు. చెరువు నీరు రాకుండా కరకట్ట నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకొంటున్నారు.

- ఇళ్లలోకి చెరువు బ్యాక్ వాటర్
- ఏటా ముంపునకు గురవుతున్న రాజీవ్‌కాలనీ
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- కరకట్ట నిర్మించాలని వేడుకోలు



ఇళ్లలోకి వస్తున్న చెరువు నీరు

ఏటా నీటిలోనే ఇళ్లు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కార్మిక క్షేత్రమైన రాజీవ్‌నగర్ శివారులో ఉన్న ఈదుల చెరువు శిఖంలో నివాసముంటున్న ఇళ్లలోకి వరద నీరు రావడంతో అనేక అవస్థలు పడుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 120 కుటుంబాలకు ఈదుల చెరువు శిఖంలో నీళ్ల లేక పట్టాలు ఇచ్చింది. దీంతో గుడిసెలు, రేకుల షెడ్లు, భవనాలను నిర్మించుకొని 25 ఏళ్ల నుంచి నివాసముంటున్నారు. కానీ కొన్ని సంవత్సరాల నుంచి వర్షాలు అధికంగా కురువడంతో ఎగువ గ్రామాల నుంచి వచ్చే వరదతో చెరువు పూర్తిస్థాయిలో నిండిపోతుంది. దీంతో వరద నీరు మొత్తం ఇళ్లలోకి చేరడంతో కాలనీ జలమయమవుతుంది. దీంతో కాలనీవాసులు ప్రతి ఏటా వర్షాకాలంలో బిక్కు బిక్కు మంటూ జీవిస్తున్నారు. నీరు ఉన్నన్ని రోజులు మరో చోటుకి తరలి వెళ్లి తిరిగి వరద నీరు తగ్గిన తరువాత తిరిగి వస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్ రాజీవ్‌నగర్‌ని దత్తత తీసుకోని ఈదుల చెరువు నీటిలో మునిగిన ఇళ్లను పరిశీలించి కరకట్ట నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తదనంతరం కలెక్టర్ బదిలీపై వెళ్లిపోవడంతో ఈ బాధితులను ఎవరు పట్టించుకోలేదు. దీంతో ప్రతి సంవత్సరం కాలనీ ముంపుకు గురవుతునే ఉంది.

ఆందోళనలో కుటుంబాలు

ఈదుల చెరువు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో కాలనీలోని దాదాపు 20 కుటుంబాలకు చెందిన ఇళ్లు నీట మునుగుతున్నాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఉండడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. తమ సమస్యను పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ముంపుకు గురయ్యే కుటుంబాలు ఇళ్లు వదిలి నీటి ప్రవాహం తగ్గిన తరువాత వస్తున్నారు. అంతేగాక ఈదుల చెరువు శిఖంలో నిర్మించుకున్న ఇళ్లు డేంజర్ జోన్ కింద ఉన్నాయని ఇళ్లపై రెడ్‌మార్క్ వేసి అధికారులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఈదుల చెరువు వరద నీరు రాకుండా కరకట్ట నిర్మిస్తే చాలా కుటుంబాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. కరకట్ట నిర్మించి శాశ్వత పరిష్కారం చూపి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఏళ్లుగా నివసిస్తున్నారు



దాదాపు 25 ఏళ్ల నుంచి ఇక్కడే ఇళ్లు కట్టుకొని వందల కుటుంబాలు జీవిస్తున్నారు. కొన్నేళ్లుగా వర్షాలు అధికంగా కురవడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండి, వరద నీటితో కాలనీ జలమయం అవుతోంది. దాదాపు 20కి పైగా ఇళ్లు నీట మునుగుతున్నాయి. అధికారులు కాలనీలోకి నీరు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి.

– అక్కేని సతీశ్, రాజీవ్‌నగర్

కరకట్ట నిర్మించాలి



వర్షాకాలం వచ్చిందంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. చెరువులోకి వరద వచ్చినప్పుడు బ్యాక్ వాటర్‌తో ఇళ్లు నీట మునుగుతున్నాయి. దీంతో నీరు ఉన్నన్ని రోజులు వేరే చోటకి తరలి వెళ్తున్నాం. ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. చెరువు నీరు రాకుండా కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటే ప్రజలకు మేలు కలుగుతుంది.

– జడల రాజు, కాలనీ వాసి

భయంతో ఉంటున్నాం



వర్షాలు పడుతున్నప్పుడల్లా ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో జీవిస్తున్నాం. ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరుతుంది. ఇటీవల కాలనీవాసులు చెరువు నీరు రాకుండా మట్టిని అడ్డుగా పోశారు. అయినా కూడా భారీ వర్షం వచ్చిందంటే ఇళ్లు నీట మునుగుతున్నాయి. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– మీనాక్షీ, కాలనీ నివాసి, రాజీవ్‌నగర్

గోవింద కృష్ణ జై.. గోపాలకృష్ణ జై



వేములవాడఅర్బన్: నృత్యం చేస్తున్న చిన్నారులు



సిరిసిల్లఅర్బన్: గోపిక, కృష్ణుని వేషధారణలతో..



రుద్రంగి: ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు



ఎల్లారెడ్డిపేట పాఠశాలలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. గోపికా, కృష్ణుల వేషధారణతో కోలాటాలు, నృత్యాలతో విద్యార్థులు అలరించారు. చిన్నారులతో ఉట్టికొట్టే వేడుక పలువురిని ఆకట్టుకుంది. – సాక్షి నెట్‌వర్క్



ముస్తాబాద్: పోతుగల్‌లో..



గంభీరావుపేట: ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు



సిరిసిల్లఅర్బన్: గోపిక, కృష్ణుని వేషధారణలతో..

రామాలయంలో కృష్ణాష్టమి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని ఆలయంలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు అఖండ భజన కార్యక్రమం కొనసాగుతుందని అర్చకులు వేణుగోపాలాచారి తెలిపారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మినారాయణరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య, ఎంపీటీసీ అపేర సుల్తానా, ఉపసర్పంచ్ మహేందర్ పాల్గొన్నారు.



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పోషకాహార వారోత్సవాలు

ముస్తాబాద్/గంభీరావుపేట/వేములవాడరూరల్/వీర్నపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహార వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ముస్తాబాద్ మండలం గూడెం, గంభీరావుపేట మండలంలోని దేశాయిపేట, లక్ష్మీపూర్ తండా, వేములవాడరూరల్ మండలంలోని మర్రిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో తల్లులు, చిన్నారులు, గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పిల్లలకు, బాలింతలకు, రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులపై వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాదేవి సర్పంచులు సరిత, చంద్రకళ, ఎంపీటీసీ శ్రీధర్, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మజ, సర్పంచ్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు శంకరమ్మ, స్వర్ణలత, విజయ, అరుణ, సరిత, లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గంభీరావుపేట: పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



వేములవాడఅర్బన్: డీటీకి వినతిపత్రం అందజేత



కోనరావుపేటలో..

వేములవాడఅర్బన్: అంగన్‌వాడీ టీచర్ల నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి రమణ అన్నారు. బోయినపల్లి మండలం డిప్యూటీ తహసీల్దార్ దివ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు అందించాలన్నారు. ఈ డిమాండ్లు ఈ నెల 11 వరకు ప్రభుత్వం పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ కమిటీ సభ్యులు సూరం పద్మ, శ్రీధర్ పాల్గొన్నారు.

కోనరావుపేట: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల సమ్మెకు దిగుతామని పేర్కొంటూ కోనరావుపేట డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు సమ్మె నోటీస్ సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26 వేలు అందించి, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రిటైర్మెంట్ వయసు 60 ఏళ్లు నిర్ణయించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. బీఎల్‌వోలుగా డ్యూటీ రద్దు చేయాలన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 11 నుంచి సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, ఉపాధ్యక్షురాలు ఒరగంటి శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, సునీత, చంద్రకళ, దేవేంద్ర, అంజలి, శీలా, సంతోష, విజయ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ అంగన్‌వాడీ టీచర్లు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షురాలు కల్లూరి చందన, మమత, శ్యామల, అరుణ, బాబాయి, మంగ, లక్ష్మి, రమ, సునిత, విజయ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి



బోయినపల్లి- కోదురుపాక రహదారిలో కూలిన బ్రిడ్జి

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలం కొదురుపాక వెళ్లే రహదారిలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి బ్రిడ్జి కూలి ప్రమాదకరంగా మారింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. అలాగే బోయినపల్లి నుంచి మర్లపేట వెళ్లే రహదారిలో కల్వర్టుకు మధ్యలో బుంగపడి ప్రమాదకరంగా ఉంది. స్థానికులు కర్రతో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముస్తాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. మండలంలోని మొర్రాయిపల్లెలో బూత్ కమిటీల నియామక ప్రక్రియను బుధవారం చేపట్టారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ మెంగని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎల్లం, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని అంకిరెడ్డిపల్లెలో బుధవారం గోరేటి రజిత రూ.24 వేలు, వనపట్ల లత రూ.19 వేలు, అబ్బు భూమవ్వ రూ.13 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ కమల పంపిణీ చేశారు.

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ గ్రామానికి చెందిన బి.ప్రవీణ్, ఇమ్రాన్, దివ్య, మాధవి సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ గుండం నర్సయ్య బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్ది కల్యాణి, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు

సిరిసిల్ల: మున్సిపల్ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం కౌన్సిలర్లు అందజేశారు. 9వ వార్డులో 8 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, 17వ వార్డులో ఎనగందుల అన్నపూర్ణకి కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ అందజేశారు.

యువతి వివాహానికి దాతల సాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని చీకోటి వనిత కూతురు శివాని వివాహానికి బీజేపీ నేత లగిశెట్టి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పుస్తె, మట్టెలు, పెళ్లి వస్త్రాలను అందించారు. బీజేపీ అధికార ప్రతినిధి చెన్నమనేని కమలాకర్, చేపూరి నాగరాజు సహకారంతో చిట్నేని ఆగమ్మ నర్సింగ రావు ట్రస్ట్ నిర్వాహకులు బియ్యం, తదితర కిరాణ సరుకులను అందజేశారు.

ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: బహెరాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని కోరుట్లపేట గ్రామానికి చెందిన మోకనపల్లి సుమన్ కుటుంబానికి జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు రూ.10 వేల ఆర్థికసాయం బుధవారం అందజేశారు.

పుస్తెమెట్టెలు అందజేత

ముస్తాబాద్: స్థానిక కేసీఆర్ కాలనీకి చెందిన రంజాని లక్ష్మి, కృష్ణ దంపతుల కూతురు లహరి వివాహానికి ఎంపీపీ జనగామ శరత్‌రావు పుస్తె, మెట్టెలను బుధవారం అందజేశారు.

ఎంపీటీసీని పరామర్శించిన జెడ్పీచైర్‌పర్సన్

కోనరావుపేట: మండలం కనగర్తి ఎంపీటీసీ లింగంపెల్లి లక్ష్మిని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ బుధవారం పరామర్శించారు. ఎంపీటీసీ భర్త లింగయ్య ఇటీవల మృతి చెందాడు. ఆమె వెంట సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్ చైర్మన్ భూంరెడ్డి, నాయకులు రాఘవరెడ్డి, గోపాల్‌రెడ్డి, స్వామి ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు అబ్బాడి అనిల్ రెడ్డికి పితృవియోగం కలగగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగారావు పరామర్శించారు.

నియామకం

కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం

వీర్నపల్లి: మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూత శ్రీనివాస్‌ను, ఉపాధ్యక్షులుగా పని శివరామకృష్ణ, బానోత్ సంగునాయక్, ప్రధాన కార్యదర్శి లకావత్ రాములు నాయక్, కోశాధికారి లెంకల లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి నక్క శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు బోనాల శ్రీనివాస్, పెడుతనపల్లి చంద్రమౌళి, జోగుల కాంతయ్య, రాకేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. అలాగే ఎస్టీ సెల్ అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్‌ను సన్మానించారు.

గుడి గంటలు బహూకరణ



ఆలయంలో గంటను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్

కోనరావుపేట: మండలం ధర్మారంలోని పెద్దమ్మ, రేణుకామాత ఆలయాలకు సర్పంచ్ గున్నాల అరుణ లక్ష్మణ్ దంపతులు 10 కిలోల గంటను అందజేశారు. ఆయా ఆలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అందించి బిగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అభిలాష్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గంగుల ప్రశాంత్, నాయకులు సిద్దంశెట్టి శ్రీనివాస్, కొమ్ము ఎల్లయ్య, వెంగల రాజు, తిరుపతి, గోపి, కిషన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిపేట: గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన అబ్బ స్వామికి చెందిన సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి బుధవారం అందజేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. రెండు నెలల క్రితం తన సెల్‌ఫోన్ మండలం పరిధిలో పోయినట్లు ఫిర్యాదు మేరకు ఐఎంఈఐ నంబర్ ద్వారా సీఈఐఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేసి గుర్తించినట్లు తెలిపారు. మూడు నెలల కాలంలో 21 సెల్‌ఫోన్‌లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు.

ఉత్తరప్రదేశ్‌లో దొరికిన ఫోన్

ఇల్లంతకుంట: కొన్ని నెలల క్రితం పోయిన ఫోన్‌ను పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్లు కనుగొని, తిరిగి ఆ ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. మండల కేంద్రానికి చెందిన ఎండీ సలీం మొబైల్ ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐఎంఐ నెంబర్ ద్వారా కనుగొన్నారు.

హమాలీ సంఘానికి స్థలం కేటాయించాలి

కోనరావుపేట: మండల కేంద్రంలోని హమాలీ సంఘ భవన నిర్మాణానికి 6 గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సర్పంచ్ పోకల రేఖ, ఉపసర్పంచ్ దండు శ్రీనివాస్ తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్ రావు బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చారి, హమాలీ సంఘ నాయకులు రాజు, నర్సయ్య, లింబయ్య, దేవయ్య, రాజు, భూమయ్య, తిరుపతి పాల్గొన్నారు.

నృసింహుని సేవలో ఆది శ్రీనివాస్



రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహునికి భక్తులు బుధవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిగా భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ కామిరె శంకర్ స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్లఅర్బన్: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 17 వరకు నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల కరపత్రాన్ని సీపీఎం నాయకులు బుధవారం ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా 10న చాకలి ఐలమ్మ వర్ధంతి, 11న బైక్ ర్యాలీ నిర్వహించి, అమృతలాల్ శుక్లా స్థూపానికి, బద్దం ఎల్లారెడ్డికి నివాళులర్పిస్తామన్నారు. 17న నాటిక ప్రదర్శన ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, నాయకులు కోడం రమణ, సదానందం, పద్మ, రాజశేఖర్, పోచమ్మ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా:
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899